సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ

సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, నవంబర్ 24: గజ్వేల్ పట్టణ సమీపంలోని ప్రజ్ఞాపూర్ మార్గంలో ఆదివారం సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ చైర్మన్ భాస్కర్, సుంకరి బాల్‌కుమార్, గంగిశెట్టి రవీందర్, మిన్నకంటి ప్రసాద్ పట్టణ వాసులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహానికి భూమిపూజ

అనంతరం గజ్వేల్‌లో లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డితో పాటు మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో భక్తుల సందడి

స్వామి వారిని దర్శించుకున్న జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు

గంగరేగు చెట్టు వద్ద భక్తుల రద్దీ

చేర్యాల, నవంబర్ 24 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది.రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు చెల్లించారు. కొమురవెల్లి క్షేత్రానికి 12వేల మందికి పైగా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు.శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశ ఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు చెల్లించారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. ఏఈవో బి.శ్రీనివాస్,ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలు అందించారు.

మల్లన్నను దర్శించుకున్న జైళ్ల శాఖ ఐజీ

కొమురవెల్లి మల్లికార్జునస్వామిని జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.స్వామి వారి దర్శనం కోసం వచ్చిన ఐజీకి ఆలయవర్గాలు ఘన స్వాగతం పలికాయి.అనంతరం ఆలయంలో ఐజీ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఐజీకి స్వామి వారి ప్రసాదాలు, శేషవస్త్రాలు, జ్ఞాపిక అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న జీడిపల్లి రాంరెడ్డి

తొగుట, నవంబర్ 24: ఆపదలో ఉన్నవారికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సీఎం సహాయనిధి ద్వారా మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన పాత్కుల మహిపాల్‌కు రూ.9 వేలు,మల్లవ్వకు రూ.15 వేలు మంజూరు కాగా వారికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండారు స్వామిగౌడ్, మహ్మద్ జహంగీర్, పిట్ల వెంకటయ్య, పులిగారి లక్ష్మణ్, ఈదుగాళ్ల పరశురాములు, ఎర్రోళ్ల నాగయ్య, నవీన్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ జలాలు

చేర్యాల, నవంబర్ 24 : చేర్యాల మార్కెట్ యార్డులోని వాటర్ ట్యాంకు నుంచి పట్టణానికి నీటిని అందించే మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతున్నది. జనగామ,సిద్దిపేట ప్రధాన రహదారిలో చుంచనకోట క్రాసింగ్ సమీపంలో ఉన్న పైపులైన్ కొన్ని రోజులుగా లీకేజీలు అవుతున్నాయి. ప్రస్తుతం పైప్‌లైన్ నుంచి ఎక్కువ జలాలు లీకేజీ అవుతూ పక్కనే ఉన్న డ్రైనేజీలోకి ప్రవహిస్తున్నాయి. నీటి లీకేజీ సమస్య నిత్యం కొనసాగుతున్నప్పటికీ వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు వెంటనే స్పందించి నీటి లీకేజీని అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలను జయప్రదం చేయాలి

హుస్నాబాద్, నవంబర్ 24: హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం జరగబోయే ప్రజా పాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి ప్రకటనలో పిలుపునిచ్చారు. సాయంత్రం 4గంటలకు ప్రారంభమయ్యే విజయోత్సవాల్లో 80మంది కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు ఉంటాయని తెలిపారు. సీనియర్ కళాకారుడు అంతడ్పుల నాగరాజు నేతృత్వంలో కళా బృందం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళా ప్రదర్శనలు చేస్తారన్నారు. ఇందు కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు.

సూచికబోర్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు

రాయపోల్,నవంబర్ 24 : రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లోని మూలమలుపులను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆదివారం పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎస్సై రఘుపతికి సూచించారు. మూలమలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తొగుట సీఐ షేక్ లతీఫ్,రాయపోల్ ఎస్సై రఘుపతి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ, పీజీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

గజ్వేల్, నవంబర్ 24: ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ మైక్రోబయాలజీలోని ఖాళీలను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామని, పీజీ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించి, డిగ్రీలో 55శాతం మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. విద్యార్థులు కళాశాలలో నేరుగా సంప్రదించాలని, ఈ నెల 25లోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9010902128 నంబర్‌లో సంప్రదించాలన్నారు. డిగ్రీ కళాశాలలో 25న పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ తెలిపారు. ఎంఏ(తెలుగు), ఎంఏ(ఎకనామిక్స్), ఎంకాం సబ్జెక్టుల్లో పీజీ కోర్సులు ఉన్నాయని, 55శాతం మార్కులతో డిగ్రీ పాస్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గత విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు ఫొటోలతో ఈ నెల 25న ఉదయం 10గంటలకు హాజరుకావాలని ఆయన తెలిపారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్

గజ్వేల్, నవంబర్ 24: డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను సద్విని యోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ అడిషినల్ సివిల్ జడ్జి బి.ప్రియాంక కోరారు. లోక్‌అదాలత్‌ను పురస్కరించుకొని ఆదివారం పోలీసులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు పిలుపుమేరకు లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ కేసులను పరిష్కరిస్తామన్నారు

- నలుగురు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

దొంగల ముఠా అరెస్ట్

రాయపోల్ పీఎస్‌లో వివరాలు వెల్లడిస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

రాయపోల్, నవంబర్ 24: వ్యవసాయ క్షేత్రాల్లో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేసే ముఠా సభ్యులను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఆదివారం రాయపోల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాయపోల్ మండలం రామారం గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారన్నారు. నలుగురు అనుమానాస్పదంగా పోలీసులను చూసి కారులో ఎక్కి ఉండగా పోలీసులు తనిఖీ చేశారన్నారు. కారులో గడ్డపార, రెండు పానలు దొరకడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేసి అందులోని కాయిల్స్,ఆయిల్ అమ్ముకున్నట్లు తెలిసిందన్నారు. గతంలో బేగంపేట పీఎస్ పరిధిలో రెండు నేరాలు,గజ్వేల్ పీఎస్ పరిధిలో రెండు నేరాలు, రాయపోల్ పీఎస్ పరిధిలో మూడు నేరాలు, జగదేవపూర్ పీఎస్ పరిధిలో మూడు నేరాలు, దౌల్తాబాద్ పీఎస్ పరిధిలో రెండు నేరాలు,కుకునూర్‌పల్లి పీఎస్ పరిధిలో ఒక నేరం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. నిందితులపై గతంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసులో చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి వారిని జైలుకు పంపించడం జరిగిందని, బెయిల్‌పై వచ్చిన తర్వాత కూడా నేరాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. కాయిల్స్,ఆయిల్‌ను దొంగిలించి తూప్రాన్‌లోని అదేశ్ అనే వ్యక్తికి అమ్ముకున్నట్లు తెలిపారు. నిందితులు హర్యానాకు చెందిన జాబర్‌ఖాన్, ఈర్షద్,రాజస్థాన్‌కు చెందిన ఫాజర్,జహీర్‌గా గుర్తించామన్నారు.అదేశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన తొగుట సీఐ లతీఫ్, కుకునూర్‌పల్లి ఎస్సై శ్రీనివాస్, జగదేవపూర్ ఎస్సై చంద్రమోహన్, రాయపోల్ ఎస్సై రఘుపతి,బేగంపేట ఏఎస్సై అమృత్, కానిస్టేబుళ్లు రమేశ్, కనకరాజు, సత్యనారాయణ, సోమయ్య, స్వామి, శ్రీకాంత్‌ను సిద్దిపేట సీపీ అనురాధ ప్రత్యేకంగా అభినందించారు. కానిస్టేబుళ్లకు రివార్డు ప్రకటించారు. సమావేశంలో తొగుట సీఐ లతీఫ్, ఎస్సై రఘుపతి, బేగంపేట ఏఎస్సై అమృత్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

సిద్దిపేట టౌన్, నవంబర్ 24: ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి కోరారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో టీఎస్ యూటీఎఫ్ ఐదో మహాసభలు జరిగాయి. మహాసభల ప్రారంభంలో ఎస్‌టీఎఫ్ఐ, టీఎస్‌యూటీఎఫ్ జెండాలను సీనియర్ నాయకుడు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఎస్కే వలిహమ్మద్ ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని 2014 నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ నేటి వరకు అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్నికల అధికారిగా మహాసభలకు హాజరైన రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సమానమైన పనికి సమాన వేతనం అందని ద్రాక్షగా మారిందన్నారు. టీఎస్ బిట్లు జిల్లా అధ్యక్షుడు ఎస్కే వలి హేమంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి, కోశాధికారి ఎం.కృష్ణ, కేజీబీవీల కార్యదర్శి సావిత్రి, నాగదేవత, హర్షియా, జిల్లా కార్యదర్శులు జి.వెంకటకిరణ్, ప్రశాంత్‌కుమార్, కనకరాజు, ఎల్.యాదయ్య, శివలింగం, గిరిబాబు, ఎం.రవీందర్, మహేశ్వరి, మమత, మంజుల పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

పాఠశాలలను బంద్‌చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట, నవంబర్ 24: ప్రత్యేక తరగతుల పేరిట విద్యార్థులను ఒత్తిడి గురిచేస్తూ ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అజయ్, నవదీప్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎగొండస్వామి

గజ్వేల్, నవంబర్ 24: గజ్వేల్‌లోని ఎస్టీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన హాస్టల్‌ను సందర్శించిన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థులకు ప్రభుత్వం సరైన వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కొమురవెల్లి, నవంబర్ 24: మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 టెన్త్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. దాదాపు 24 ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు నాగభుషణం, నర్సింహులు, ఆనంద్, నర్సయ్య, జనార్దన్‌రెడ్డి, వేణుగోపాల్, పూర్వ విద్యార్థులు మెరుగు కిరణ్‌కుమార్, రవి, రాజు, సుదర్శన్, షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఐనాపూర్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సమగ్ర సర్వేను త్వరగా పూర్తిచేయాలి

తొగుటలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న అబ్దుల్‌అహ్మద్

తొగుట, నవంబర్ 24: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపే సమగ్ర సర్వేను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ అహ్మద్ అన్నారు.ఆదివారం తొగుట మండలంలోని సమగ్ర సర్వే పనులు, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర సర్వేను పూర్తి చేసి త్వరగా డాటా ఎంట్రీ పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మండలంలోని వెంకట్రావుపేట పోలింగ్ కేంద్రాలు 134, 135లను సందర్శించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కూలిన ఇల్లు

అహ్మదీపూర్‌లో కూలిన ఇల్లు

గజ్వేల్, నవంబర్ 24: ప్రమాదవశాత్తు ఇల్లు కూలడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చాకలి మహిపాల్ ఉపాధి కోసం కుటుంబంతో కలిసి ముంబాయి వెళ్లిన అతడు దసరా పండుగ సందర్భంగా సొంతూరికి వచ్చాడు. శనివారం ఇంట్లో భార్యాభర్తలు నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా పెంకుటిల్లు కూలివారిపై పడడంతో 15 నిమిషాల పాటు అందులోనే ఉన్నారు. భారీ శబ్దానికి ఇరుగుపొరుగు వారు తేరుకొని అక్కడికి వచ్చి మహిపాల్ దంపతులను రక్షించారు. పక్క గదిలో వారిద్దరు పిల్లలు పడుకోవడంతో వారికి అపాయం తప్పింది. భార్యాభర్తలకు స్వల్పగాయాలయ్యాయి.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ అహ్మద్

విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ అహ్మద్

మిరుదొడ్డి, నవంబర్ 24: విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ అహ్మద్ సూచించారు. ఆదివారం మిరుదొడ్డి టౌన్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డించే వంటలను పరిశీలించారు. సక్రమంగా పౌష్టికాహారం.. అందిస్తున్నారా..? లేదా, ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు మీకు అర్థమవుతున్నాయా..? అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాల్లో నిలువాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో స్వర్ణలత పాల్గొన్నారు.

పాత్ ఫైండర్ జిల్లా స్థాయి పోటీ పరీక్ష బ్రోచర్ ఆవిష్కరణ

పోటీ పరీక్ష బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 24: లీడ్ లైఫ్ హ్యాపీలీ సంస్థ నిర్వహిస్తున్న పాత్ ఫైండర్ పోటీ పరీక్ష బ్రోచర్‌ను ఆదివారం కొండపాక మండలంలోని దుద్దెడలో జిల్లా విద్యాధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి, లీడ్ లైఫ్ హ్యాపీలీ సంస్థ వ్యవస్థాపకులు కోణం శ్రీకాంత్, శిరీషతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న 6,7,8వ తరగతి విద్యార్థులకు గణితశాస్త్రంలో వివిధ అంశాల్లో వారి ఆలోచన విధానం పెంపొందించాలన్న ఉద్దేశంతో పోటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతగా డిసెంబర్ 28న పాఠశాల స్థాయిలో, వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 8న జిల్లా స్థాయిలో ఉత్తమ విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష రాసేందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఫిబ్రవరి 8న నిర్వహించే చివరి పోటీ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ. 50వేల నగదుతో పాటు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లీడ్ లైఫ్ హ్యాపీలీ సంస్థ నిర్వాహకులను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, నిర్వాహకులు కోణం శ్రీకాంత్, చంద్రం బాలకృష్ణ, రమేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్, నవంబర్ 24: ప్రపంచ జీవపరిణామ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గజ్వేల్‌లో జీవపరిణామ సిద్ధాంత ప్రచారోద్యమ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తుమ్మ సత్యం మాట్లాడుతూ చార్లెస్ డార్విన్ ప్రపంచ వ్యాప్తంగా అనేక దీవులను సందర్శించి అక్కడ ఉంటున్న వివిధ రకాల జీవులను పరిశీలించారన్నారు. ఆ ప్రాంతంలో దొరికిన శిలాజాలాలను సేకరించి వాటిపైన అనేక సంవత్సరాలు పరిశోధనలు చేశారన్నారు. కార్యక్రమంలో తుమ్మ శ్రీనివాస్, నిమ్మ రమేష్, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుస్నాబాద్, నవంబర్ 24: ఎస్సీల వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభ పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ చేసి ఎస్సీలను విభజించి రాజకీయాలు చేయాలని చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1వ తేదీన సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం 12గంటలకు మాలల సింహగర్జన సభ జరుగుతుందని, ఈ సభకు హుస్నాబాద్ పట్టణం నుంచేకాకుండా చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మాలలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు గుడుమల్ల సత్తయ్య, బోజు రవీందర్, లీగల్‌సెల్ అడ్వైజర్ సావుల రాజమౌళి, పట్టణ కన్వీనర్ సావుల శ్రీనివాస్, నాయకులు కొమురయ్య, రమేశ్, బాలయ్య, కనుకయ్య, రవీందర్, రాజీవరావు, వంశీ, కోటేశ్వర్‌రావు, వీరస్వామి, వెంకటయ్య పాల్గొన్నారు.

రాజమౌళికి సత్కారం



రాజమౌళిని సత్కరిస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, నవంబర్ 24: సాహిత్యకృషి ద్వారా ఎనలేని కీర్తి గడించవచ్చని కథా రచయిత ఐత చంద్రయ్య అన్నారు. ఇటీవల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కవి,రచయిత ఎన్నవెల్లి రాజమౌళి బాలసాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. సిద్దిపేట కళాభవన్‌లో ఆదివారం కవులు ఆయనకు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాపు రమేశ్, లక్ష్మయ్య, రాజేశం, నరసింహారావు, బస్వరాజ్ కుమార్, పేరణి రమేశ్‌లాల్, రాములు, సురేందర్, రాములు, పరశురాములు, వెంకటేశ్వర్లు, సిద్ధిరాములు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు వెంకట్రావుపేట విద్యార్థి

బి.అనీశ్

తొగుట, నవంబర్ 24: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 17 నెట్‌బాల్ పోటీలకు వెంకట్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి అనీశ్ ఎంపికయ్యాడని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నయీమకౌసర్, పీఈటీ కనకయ్య తెలిపారు.ప్రజ్ఞాపూర్ పాఠశాలలో జరిగిన అండర్ 17 విభాగంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.మహబూబాబాద్‌లో ఈ నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఎంపికైన విద్యార్థి అనీశ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామస్తులు అభినందించారు.

సంకల్ప దీక్ష కరపత్రం ఆవిష్కరణ

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 24: ధూళిమిట్ట మండల కేంద్రంలో చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనలో భాగంగా ఈ నెల 30న జేఏసీ తలపెట్టిన సంకల్పదీక్ష కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 24: ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన మద్దూరు మండలంలోని లద్నూర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి బెడద సత్తయ్య అనే రైతు రోజు మాదిరిగానే తన ట్రాక్టర్‌ను వ్యవసాయ బావి వద్ద ఉంచి ఇంటికి వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున వ్యవసాయ బావి వద్దకు వెళ్లిచూడగా ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైనట్లు గుర్తించాడు. రెండు నెలల క్రితం మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 15 బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. తాజాగా మరోసారి ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురికావడంపై ట్రాక్టర్ యజమానులు ఆందోళన చెందుతున్నారు.

ముగిసిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్షలు

సిద్దిపేట, నవంబర్ 24: జిల్లా వ్యాప్తంగా తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం పరీక్షా కేంద్రాలను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. జిల్లాలో మొత్తం 1877 మంది విద్యార్థులకు 1823 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

బోరు వేయిస్తున్న అన్నారెడ్డి సుభాష్‌రెడ్డి

రాయపోల్, నవంబర్ 24: దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణలో ఆదివారం సీనియర్ నాయకుడు అన్నారెడ్డిగారి సుభాష్‌రెడ్డి సొంత నిధులతో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. సొంతగ్రామానికి సేవ చేస్తూ గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సొంత గ్రామానికి సేవ చేస్తే ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు షాదుల్లా, హన్మంత్, వేమ శ్రీనివాస్, యాదగిరి, మల్లేశ్, కుమార్, ఎల్లం రవి, నర్సింహులు పాల్గొన్నారు.

నిరుపేదకు చేయూత



టీస్టాల్‌ను ప్రారంభిస్తున్న సభ్యులు

గజ్వేల్, నవంబర్ 24: ఆర్థిక చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్‌కు చెందిన నిరుపేద మల్లేశానికి ఆర్థికసాయం అందజేశారు. నిరుపేదకు టీస్టాల్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారు. కొంతకాలంగా కుటుంబ పోషణకు చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆర్థిక ఫౌండేషన్ సభ్యులు చేయూతనందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మధు, దామోదర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట టౌన్, నవంబర్ 24: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని (ఎస్‌టీయూ) స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిద్దిపేట ఎన్జీవోస్ భవన్‌లో ఎస్‌టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇవ్వాల్సిన డీఏలను పూర్తిగా ఇవ్వకుండా ఒక డీఏ ఇవ్వడం శోచనీయమన్నారు. కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు డాటా ఎంట్రీ నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్, రంగారావు, గజేందర్, యాదగిరి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సదానందంగౌడ్